మినీ కథ

# విద్యార్థిని

-ఆచంట హైమవతి

"చదువుకున్న పిల్ల, రూపసి, చలాకీతనం, అణకువ... వసుధ నాకు చాలా నచ్చింది. మీరు ఎప్పుడు వస్తారో తెలిపితే నేను అన్ని ఏర్పాట్లు చేయిస్తాను" అని రాసింది మా అత్తయ్య.

నేను వరకట్న వ్యతిరేకిననీ, మూఢవిశ్వాస శత్రువుననీ ఆమెకు తెలుసు. చిన్ననాటి నుంచి అత్తయ్య అభిప్రాయాల మీద నాకు గురి. అత్తయ్య దగ్గరుండి డిగ్రీ చదివిన రోజుల్లో అత్తయ్యే నాకు గురువు, స్నేహితురాలు, అధికారిణి కూడా అయి నన్ను తీర్చిదిద్దింది.

అత్తయ్య కూతుళ్ళిద్దరూ నాకు ఈడైన వారే. కాని వారు నాకు స్నేహపాత్రులు మాత్రమే. మామయ్యకి బంధు వివాహాల పట్ల విముఖత్వం. అత్తయ్య మాటల్లో కూడా అదే అభిప్రాయం బయటపడుతూంటుంది. కొంచెం పాతకాలం మనిషైనా అమ్మకి చదువుకొన్న కోడలు అంటే ఇష్టమే. అందరికీ సమ్మతమైంది.

కాని మా బామ్మ మాత్రం "చదువుకున్న పిల్లయితే చెప్పిన మాట వినదు. ఉద్యోగం చేస్తాననీ, ఊళ్ళేలతాననీ గొడవ మొదలెడుతుంది. మహిళా మండలి, క్లబ్ అంటూ ఇంటి పట్టున ఉండదు. కాలేజీ నున్నిత లొలకబోసి... ఇంటి పనికి లొంగదు." లోకంలో ఉన్న చెడు లక్షణాలన్నీ ఏకరువుపెడ్తూ గొడవ మొదలెట్టింది.

మా నాన్న ఎంత తెలివైనవాడైనా తల్లి మాట కాదనలేడు. ఆవిడ మాటలు వింటున్నంతసేపూ, అదే నూరుపాళ్ళూ నిజమనిపించేలాగ కమ్మగా నచ్చచెప్పటం ఆమెలోని నైపుణ్యం.

"అసలు ముందు పిల్లని చూసి వద్దాం. ఆ తరువాత గదా మిగతా విషయాలు" అన్న అమ్మలో ఆ అమ్మాయిని చూడాలని ఆత్రత.

"అందరం ఎగబడి వెళ్ళి చూసి తరువాత నచ్చలేదని చెప్తే పూర్వం మీ రోజుల్లోలా నోరు మూసుకుని ఊరుకో రిప్పుడు. ఎందుకు నచ్చలేదో చెప్పమంటారు. బాగా చదువుకోవటమే ఆ అమ్మాయి లోపం అని చెప్తామా? లేక మేము మూర్ఖులం... ని న్నాహ్వానించేటంత సంస్కారం మాకు లేదు అని చెప్తామా?" వధువు ప్రతినిధిలా సవాల్ విసురుతున్నది మా చెల్లెలు ఝాన్సీలక్ష్మి. మంచి మార్కులతో స్కూలు చదువు ముగించి, మా బామ్మ కారణంగా కాలేజీలో చేరలేక, నా సలహాతో పి. యు. సి. ప్రైవేటుగా పాసై, డిగ్రీ చదువుతానని ఇంట్లో పోరాటం సాగిస్తున్న ధైర్యశాలి.

"అయితే మరి... పిల్లని చూడటానికి..." అమ్మ గొణుగుడు.

"తీరా నీ కొడుకు ఆ పిల్లని చూశాక దాన్నే చేసుకుంటానని పట్టుబడితే? ఏ ఇస్కూలు ఫైనలో అయితే పరవాలేదు గాని... ఆ ఎస్సీలు, బీస్సీలు చదివిన పిల్లైతే అందర్నీ తలొక ఆటా ఆడిస్తుంది. ముందరే చెప్తున్నాను చూసుకోండి." తన మాటలతో బెదిరిస్తోంది బామ్మ.

"బామ్మ దృష్టిలో డిగ్రీ చదివిన అమ్మాయి కాకూడదు. పని బాగా చెయ్యాలి అంతే గదా. మన బుల్లచ్చమ్మ కూతురు పచ్చమ్మని చేసుకుంటే సరి. పాచిపని దగ్గర్నుంచి మీరు ఒప్పుకోవాలే గాని పొపులవరకూ చేసి అక్కడ పారేస్తుంది. దొడ్లో పనుల మొదలు - పొలం పనుల వరకూ దడదడలాడించేస్తుంది. ఎటొచ్చీ కచ్చాపోసి చీర కట్టుకొని, బిందె నెత్తిన కాకుండా చంక నెత్తుకొని నీళ్ళు తేవటం, మడివంట, వాసిన కుడుము వెయ్యడం లాంటివి కొంచెం బామ్మ దగ్గర ట్రైనింగ్ అయితే ఫస్ట్ క్లాస్ గృహిణి..." ప్రతీదీ తమాషాగా తేల్చేసే మా తమ్ముడు రాకేష్ మాటల్ని సగంలో తుంచేస్తూ- "ఒరేయ్... ఒరేయ్... నీకు పొగరెక్కిందిరా! ఈ మధ్య అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. ఏదీ ఆ గరి టందుకో, పళ్ళు రాలగొడతాను కుంకని." కోపంగా అంది బామ్మ.

రాకేష్ అంటే బామ్మకి చాలా ప్రీతి. మా తాతయ్య పేరు వాడికి పెట్టించింది. రాఘవయ్య అనే పేరు మోటుగా ఉందని మా బామ్మని బ్రతిమాలి అదే అక్షరంతో ప్రారంభం అయ్యే రాకేష్‌గా పేరు మార్చించుకొన్నాడు.

"ఖాదర్ కూతురు వహీద శుద్ధ శాకాహారిట. నల్లమునుగు కూడా వేసుకోదు. బొట్టు పెట్టుకోవాలని మనసుట. ఇస్కూలు ఫైనలే చదివి ఊరుకుందిట. వాళ్ళ నాన్న ఒకటే గోల పాపం! దాని తీరు చూసి వాళ్ళ మతం వాళ్ళందరూ తిడుతున్నారట." అగ్నిహోత్రంలో మరొక సమిధ వేశాడు రాకేష్.

"హాస్పిటల్ మిడ్‌వైఫ్ మరియా చెల్లెలు సోనియా కూడా శాకాహారిట. ఎగ్ కస్టర్డ్ వాసన కూడా చూడదట. మొన్న స్కూల్ డే ఫంక్షన్‌లో 'శివధనుర్భంగం' నాటకంలో సీతదేవిగా ఎంతో బాగా వేసిందట. సాక్షాత్తూ సీతదేవి కూడా సోనియా ముందు దిగదుడుపేనట. మ నింటి కోడ లయితే బామ్మకి నిత్యం రామాయణ, భారత, భాగవతాలు చక్కగా చదివి వినిపిస్తుంది కూడా."

"నిన్ను... నిన్ను... ఏం చేసినా పాపం లేదురా! ఫో... అవతలకి ఫోరా!" కోపంతో రొప్పుతోంది బామ్మ. ఆమెకు బి. పి. ఎక్కువైతే ఆరోగ్యం చెడుతుంది.

"ఛీ. స్టుపిడ్... నోరు ముయ్యి." రాకేష్ రెక్క పట్టుకుని గది బయటకి లాక్కుపోయా న్నేను. ఏ విషయమూ చిలికి, చిలికి గాలివాన కావటం నా కిష్టం ఉండదు. అందులో ఇది నా పెళ్ళి సంగతి కదా! నిదానంగా చర్చిద్దాం అనుకుంటూంటే వీ డొకడు మధ్యలోనే గొడవ చేస్తాడు. చిరాగ్గా రాకేష్ వైపు చూశాను.

"లేకపోతే ఏమి టన్నయ్యా? అన్నీ సక్రమంగా ఉన్నా కూడా ఏదో ఒక సాకు వెతకడం అలవాటయిపోయింది ఈ పెద్దవాళ్ళకి. అసలు నువ్వు వరకట్నం, లాంఛనాలు, అనవసరపు, ముచ్చట్లు, చాదస్తాలు వద్దంటున్నావని బామ్మకి నీ మీద అక్కసు. సంస్కారం అనేది స్వరహాగా ఉండాలే గాని చదువుకొన్న వాళ్ళందరూ గర్విష్టు లనుకొంటే ఎలా? అయిదో క్లాసు కూడా దాటలేని జానకీదేవి [మా బామ్మ దూరపు బంధువు] గొప్పకోసం క్లబ్‌లో పార్టీలు చేసి అప్పులపాలై కూడా డబ్బుతో పేకాటలు, సంఘసేవ వంకతో చందా వసూళ్ళూ..."

"చాల్లేరా బాబూ! పురాణం చదవకు. చూడగా చూడగా... నీ ఉపన్యాస ధోరణి రాజకీయ నాయకుల్ని గుర్తుకు తెస్తోంది." నవ్వా న్నేను.

సిగ్గుగా తల దించుకొంటూ "నీకు తెలియ దన్నయ్యా నేను చెప్పేది."

"తెలుసురా బాబూ. కాని మన దాకా వచ్చేసరికి ఏదో బలహీనత. గందరగోళం చేసి మనం అన్నీ సాధించలేము గదా! చూద్దాం. అర్థం టేముంది? మన ఆదర్శాలు నెరవేర్చుకోవటానికి చిట్కాలు వెతకాలి గాని, ఆ విషయంలో ఇంట్లోనే కల్లోలాలు సృష్టించుకుంటే ఎలా? ఆ వచ్చే అమ్మాయిని ఇంట్లో అందరూ అభిమానించ గలిగితేనే గదా ఆ అమ్మాయి అత్తింట్లో సుఖపడేది? రేపు నీ భవిష్యత్తు విషయమూ అంతే. తొందర పనికిరాదు. ఆలోచించి మరీ నిర్ణయానికి రావాలి. ఏమంటావ్ రాకేష్?"

నా మాటలతో రాకేష్ ఆలోచనలో పడ్డట్లు కనిపించింది. యోచన మెదడుకి మంచిది.

** ** **

ఏ విషయం తేలకుండానే పది రోజులు గడిచిపోయాయి. రాకేష్ మాటలు బామ్మ మనసులో అనుమాన బీజాలు నాటాయే ఏమో నేను సెలవు పూర్తై వెళ్ళిపోతుంటే దగ్గర కూర్చోపెట్టుకుని "నా తరం ఇలా వెళ్ళిపోనివ్వరా నాయనా. నీ తమ్ముడి బుద్ధులు చూశావా? వాడి పెళ్ళినాటి వరకూ నేను బ్రతక్కపోవచ్చు గాని, నీ పెళ్ళి చూడకుండా చావనులేరా. అందరూ సుఖసంతోషాలతో ఉండాలనేరా నా ఆశానూ. కాని పనులేం చెయ్యకు సుమా" అంటూ బోధించి పంపింది బామ్మ.

దరిదాపుగా నేను డ్యూటీలో జాయిన్ అయి ఇరవై రోజు లవుతోంది. ఒక నెల పూర్తి కాకుండానే అత్తయ్య చూసిన అమ్మాయిని ఆ ఇంటి కోడలుగా చేసుకొనేందుకు సంపూర్ణంగా అంగీకారం తెల్పుతూ ఆ అమ్మాయి ఫోటో నాకు పంపమని ఆదేశించిందట. ఫోటోలో వసుధ ముచ్చటగా, చక్కగా ఉంది.

ఆరోగ్యకరమైన ఈ మార్పు బామ్మలో హఠాత్తుగా ఎలా కలిగింది? మా బంధువుల్లో ఎవరైనా కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నారా? లేక కొండదొర లెవరైనా [మా బామ్మకి కొండదొర జోస్యం మీద నమ్మకం లెండి] జోస్యం చెప్పారా? ఆశ్చర్యం ప్రకటిస్తూ నేను రాసిన జాబుకి అత్తయ్య నుంచి వెంటనే జవాబు వచ్చింది.

అందర్నీ బలవంతం పెట్టి పెళ్ళికి పంపించిన బామ్మకి హఠాత్తుగా వచ్చిన పోస్ట్ కవరు ఆదుర్దా కలిగించింది. ఆ చుట్టుపట్ల ఇంగ్లీషు చదివిన వాళ్ళెవరూ లేరు. మగాళ్ళందరూ పనులమీద వెళ్ళటం వల్ల తక్షణం ఎవరి సహాయమూ లభించలేదు.

'ఇప్పుడెలా? ఏముందో ఇందులో? ఛీ పాడుబ్రతుకు... ఇంగ్లీషు వచ్చి ఉంటే ఎంత బాగుండేది? ఏమిటో అయిదో క్లాసుతోనే మాన్పించి కొంప మునిగినట్లు పెళ్ళి చేసేశారు. నేనైనా పట్టుపట్టి చదువుకున్నాను కాదు. ఇన్నాళ్ళూ ఈ ఆలోచనే రాలేదు నాకు. విద్యవల్ల నష్టం లేదు కదా పైగా లాభం కూడాను. ఇదిగో ఇలాంటి బాధ ఉండదు' అనుకుందిట.

బామ్మని ఆత్రపరచిన ఆ ఉత్తరంలో అంత ముఖ్యవిషయం ఏదీ లేదుట కాని బామ్మ ఆనాడు పడిన ఆదుర్దావల్ల నా సమస్య తీరింది. బామ్మ విద్యా లాభం గుర్తించింది. ఇప్పుడు బామ్మ మనవరాలి దగ్గర ఇంగ్లీషు అక్షరాలు నేర్చుకుంటోందట. ★